


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 344 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 14 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :344 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 14 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు..
## ప్రారంభించిన రామ్మోహన్

పెన్ పవర్ డెస్క్: ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు

- మిగతా 2లో

# ఇది ఆరంభం మాత్రమే..
## గ్రాఫిక్స్ అన్నవాళ్ల కళ్లు తెరిపించేలా అమరావతి

- అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రపంచ టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాజధాని నిర్మాణానికి ఐదు కీలక సూత్రాలను ప్రకటించిన ముఖ్యమంత్రి
- భూములిచ్చిన రైతుల త్యాగాన్ని కొనియాడిన చంద్రబాబు
- మూడు రాజధానుల విధానంతో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శ
- 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపు





పెన్ పవర్ డెస్క్:మూడు రాజధానుల పేరుతో గత ప్రభు త్వం ఆడిన 'మూడు ముక్కల ఆట'తో అమరావతి, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు పూర్తిగా విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపి, 30 వేల ఎకరాలు అవసరమని చెప్పిన ఆనాటి ప్రతిపక్ష నేత, అధికారంలోకి వచ్చాక మాట మార్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గత ఐదేళ్లలో అమరావతిపై జరిగిన కుట్రలను, విధ్వంసాన్ని పూసగుచ్చినట్టు వివరించారు.

**అసెంబ్లీలో ఒక మాట.. బయట మరో నాటకం**

గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఆనాడు అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు, రాజధానికి 30 వేల ఎకరాలు చాలదు, 40-50 వేల ఎకరాలు ఉండాలని ఆనాటి ప్రతిపక్ష నాయకుడు గొంతెత్తారు. తాను కూడా ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని నాటకాలు ఆడారు. కానీ, ఎన్నికల్లో గెలిచిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేశారు. ఈ చర్య నన్ను తీవ్రంగా బాధించింది"

- మిగతా 2లో



## చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారు

- జైలులో నన్ను కూడా అవమానించారు: జగన్
- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ..

- మిగతా 2లో



## 'పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు..
## కేంద్రం జోక్యం చేసుకోవాలి

- రాజ్యసభలో పంచధారల మైనింగ్ అంశాన్ని లేవనెత్తిన వైవీ సుబ్బారెడ్డి
- వారసత్వ కట్టడాల పరిరక్షణకు మైనింగ్ తక్షణం ఆపాలని డిమాండ్
- కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణకు అభ్యర్థన
- 10 రోజుల్లోగా కేంద్ర బృందం పరిశీలిస్తుందని కేంద్ర మంత్రుల హామీ

- మిగతా 2లో

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..
## వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

- ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్
- దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం
- మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు

- మిగతా 2లో






## మా సార్ మాకే కావాలి..
### రోడ్డెక్కిన విద్యార్థులు, వెనక్కి తగ్గిన ఝార్ఖండ్ ప్రభుత్వం

- ఝార్ఖండ్‌లో హెడ్ మాస్టర్ బదిలీపై విద్యార్థుల ఆందోళన
- మూడు రోజులుగా ప్రధాన రహదారిని దిగ్బంధించిన విద్యార్థులు
- నచ్చజెప్పబోయిన అధికారిపై దాడి, పోలీస్ స్టేషన్‌పై రాళ్లదాడి
- దిగివచ్చిన అధికారులు, హెడ్ మాస్టర్ బదిలీ ఉత్తర్వులు రద్దు
- ఉపాధ్యాయుడితో ఫోన్‌లో మాట్లాడి ఆందోళన విరమించిన విద్యార్థులు

- మిగతా 2లో

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు
### మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు



- ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన

- మిగతా 2లో

## ముందు భారత్‌కు తిరిగి రండి.. ఆ తర్వాతే పిటిషన్ విచారిస్తాం
### విజయ్ మాల్యాకు బాంబే హైకోర్టు స్పష్టీకరణ

- విదేశాల్లో ఉంటూ క్రిమినల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరన్న బాంబే హైకోర్టు
- ఇండియాకు తిరిగొస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని వెల్లడి
- ఎప్పుడు తిరిగొస్తారో పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:పరారీలో ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్లపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తే తప్ప... 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం' చట్టబద్ధతను సవాలు చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని ధర్మాసనం తెగేసి చెప్పింది.దేశం దాటి విదేశాల్లో

- మిగతా 2లో



## మీరు చేయకపోతే మేమే చేస్తాం
### ప్యాకేజ్డ్ ఫుడ్ అంశంలో కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



- ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం
- కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గుతున్నారా అని కేంద్రాన్ని నిలదీత
- తుది నిర్ణయం చెప్పేందుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు

పెన్ పవర్ డెస్క్:అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం" అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది.

- మిగతా 2లో

## 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు..
## ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం హెచ్చరించారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణా కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎస్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ...అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళు న్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

# మీరు చేయకపోతే మేమే చేస్తాం

- మొదటి పేజి తరువాయి

ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది.

జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. “తయారీదారులు తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఈ లేబుళ్లను వ్యతిరేకించవచ్చు, కానీ తాము కొనుగోలు చేసే వస్తువులో ఏయే పదార్థాలు ఉన్నాయో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది” అని కోర్టు వ్యాఖ్యానించింది.అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా ‘రెడ్ మార్క్’ పడుతుందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదించారు. అయితే, ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వం బాధ్యత కాదా అని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని, లేనిపక్షంలో తదుపరి విచారణలో తామే తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..

## వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

- మొదటి పేజి తరువాయి

అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ–ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు.అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘హనుమాన్’ కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# ఇది ఆరంభం మాత్రమే..

- మొదటి పేజి తరువాయి

అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్షతోనే అమరావతిని చంపేయాలని చూశారని, ఈ క్రమంలో రైతుల త్యాగాలను అవమానించారని మండిపడ్డారు.

**గ్రాఫిక్స్ అన్నవాళ్లే తలదించుకుంటారు**

అమరావతి నిర్మాణ ప్రణాళికలను ‘గ్రాఫిక్స్’ అని ఎగతాళి చేసిన వారిపై చంద్రబాబు తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. “మేము ప్రపంచ స్థాయి నమూనాలతో ఐకానిక్ భవనాలు ప్లాన్ చేస్తే, వాటన్నిటినీ గ్రాఫిక్స్ అన్నారు. ఆ గ్రాఫిక్స్ నిజమైతే వారి పరిస్థితి ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఈరోజు ప్రారంభమైన ఈ రాజమార్గమే వారికి సమాధానం చెబుతుంది” అని ఆయన అన్నారు. అమరావతి నిర్మాణానికి సహకరించిన సింగపూర్ ప్రభుత్వంపై కూడా గత పాలకులు వేధింపులకు పాల్పడ్డారని, వారిని కూడా ఇబ్బంది పెట్టే దుస్థితికి దిగజారారని చంద్రబాబు ఆరోపించారు. అంతర్జాతీయంగా రాష్ట్ర పరువును మంటగలిపారని విమర్శించారు.

**రైతుల ఉద్యమం చారిత్రాత్మకం**

అమరావతి కోసం రైతులు చేసిన పోరాటాన్ని చంద్రబాబు కొనియాడారు. “చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఉద్యమం ఏదైనా ఉందంటే అది అమరావతి రైతుల ఉద్యమమే. మీరు పడిన కష్టాలు నేను కళ్లారా చూశాను. మీకు అండగా నిలవడానికి పార్టీ ఖాతాలో డబ్బులు లేని సమయంలో నేను జోలె పట్టి డబ్బులు వసూలు చేసి న్యాయపోరాటానికి సహకరించాను. నా భార్య సైతం తన చేతి గాజులు తీసి ఉద్యమానికి విరాళంగా ఇచ్చింది. అలాంటి మీ త్యాగాల పునాదులపైనే ఈ రాజధాని మళ్లీ నిలబడుతోంది. మీ పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా” అని భావోద్వేగంగా ప్రసంగించారు. చిన్న చిన్న న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి ప్రాజెక్టును ఆపాలని చూసినా, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని హైకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

**ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి**

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అదొక అద్భుతమైన భవిష్యత్ దర్శనమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాలతో దీనిని నిర్మించనున్నట్లు తెలిపారు.

1. నో పోల్స్ సిటీ: రోడ్లపై కరెంట్ స్తంభాలు, వైర్లు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డక్ట్ వ్యవస్థ.
2. బ్లూ సిటీ: కృష్ణా, గోదావరి జలాలతో నగరం మొత్తం నీటి వనరులతో కళకళలాడటం.
3. గ్రీన్ సిటీ: 50 శాతానికి పైగా పచ్చదనంతో, అత్యుత్తమ జీవవైవిధ్యంతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపడం.
4. గ్రీన్ ఎనర్జీ: సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలతో ‘నెట్ జీరో కార్బన్’ నగరంగా తీర్చిదిద్దడం.
5. నాలెడ్జ్ ఎకానమీ: డీప్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, ఉన్నత విద్యాసంస్థలతో విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మార్చడం.

ఈ ఐదు సూత్రాలతో అమరావతిని భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోని టాప్–5 రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్‌నిర్మించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిస్వార్థంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈరోజు వేసింది మొదటి అడుగేనని, ఇకపై అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్ప సిద్ధికి కేంద్రంగా అమరావతి నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

**“అనే నేను” – ప్రతి పౌరుడూ సైనికుడే**

2047 నాటికి భారతదేశం వికసిత భారత్‌గా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఈ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. “ప్రతి ఒక్కరూ ‘... అనే నేను’ (మీ పేరు చెప్పుకుని) అని ఒక సంకల్పం తీసుకోవాలి. మీ అభివృద్ధి, మీ కుటుంబం, మీ రాష్ట్రం, మీ దేశం కోసం ఏం చేస్తారో ప్రతిజ్ఞ చేయాలి. ఆ సంకల్పాన్ని ప్రతిరోజూ గుర్తుచేసుకుంటూ పనిచేయాలి. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడం అంటే యుద్ధాలు చేయడం కాదు. రైతు బాగా పంట పండిస్తే, విద్యార్థి బాగా చదువుకుంటే, ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో రాణిస్తే అదే నిజమైన దేశభక్తి” అని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, తిరంగా ర్యాలీలతో స్ఫూర్తిని నింపాలని కోరారు.ముఖ్యమంత్రి తన ప్రసంగం చివర్లో, ఈ రహదారి ప్రారంభోత్సవం అభివృద్ధి ప్రస్థానంలో తొలి అడుగు మాత్రమేనని, ఇక్కడి నుంచి ప్రతి రోజూ అమరావతి నిర్మాణం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్న రైతులు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, “భారత్ మాతాకీ జై, తెలుగు తల్లికి జై, జై అమరావతి” నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ‘సర్’ పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు.. ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

నగదుతో పాటు సున్నితమైన బ్యాంకింగ్ వివరాలను దొంగిలించేందుకు కొందరు మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు పంపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల గురించి సీఈఓ కార్యాలయం సవివరంగా వెల్లడించింది. “ఓటరు గుర్తింపు కార్డులోని వివరాలు, ‘సర్’ ఫారంలోని వివరాలతో సరిపోలడం లేదని, అందుకే మీ దరఖాస్తు తిరస్కరణకు గురైందంటూ ఓటర్లకు సందేశాలు పంపుతున్నారు. సవరణ కోసం ఒక నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయాలని వారు సూచిస్తున్నారు. ఆ తర్వాత, నామమాత్రంగా రూ.5 చెల్లించాలని కోరుతూ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డుల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్లు, సీవీవీ నంబర్లు, ఏటీఎం పిన్‌ల వంటి అత్యంత రహస్య సమాచారాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు” అని సీఈవో వివరించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ, తెలంగాణ సీఈఓ కార్యాలయం కానీ ఓటర్లకు ఇటువంటి సందేశాలు పంపదని, ఫోన్ కాల్స్ చేయదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటువంటి మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక ఈసీఐ ప్లాట్‌ఫారమ్‌లను సంప్రదించాలని లేదా నేరుగా తమ బూత్ స్థాయి అధికారులను కలవాలని అధికారులు సూచించారు.

## ‘పంచధారల’ వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్‌లోని పంచధారల వారసత్వ ప్రాంతం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభలో గళం విప్పారు. ప్రాచీన బౌద్ధ స్థూపాలు, ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.మినరల్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పంచధారలలోని బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి అతి సమీపంలో మైనింగ్ జరుగుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణం గుండా ప్రవహించే ఐదు సహజ నీటి ప్రవాహాల వల్లే ఆ ప్రాంతానికి ‘పంచధారల’ అని పేరు వచ్చిందని, ప్రస్తుత మైనింగ్ కార్యకలాపాలతో ఆ పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వెంటనే తనిఖీలు చేపట్టాలని, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయాలని, అన్ని అనుమతులను పునఃపరిశీలించాలని కోరారు. ఈ అధ్యయనాలు పూర్తయ్యే వరకు మైనింగ్‌ను నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు.ఖనిజ సంపద ప్రజలదని, దాని నిర్వహణలో పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి అన్నారు. మైనింగ్ విధానాలను రూపొందించేటప్పుడు రాష్ట్రాల ఆదాయానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు.అంతకుముందు, ఇదే అంశంపై వైసీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, గుమ్మ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని అధికారిక విచారణలో తేలినట్లు వారు మంత్రులకు వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రులు.. పది రోజుల్లోగా ఒక కేంద్ర బృందాన్ని పంపి మైనింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు.ఈ వ్యవహారంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే సరిపోదని, అక్రమ తవ్వకాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ. 250 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని పేర్కొన్నారు.

# మా సార్ మాకే కావాలి..

ఝార్ఖండ్‌లో తమ అభిమాన హెడ్ మాస్టర్‌ను బదిలీని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఫలించింది. విద్యార్థుల పట్టుదల ముందు అధికారులు తలొగ్గక తప్పలేదు. మూడు రోజుల పాటు ఉద్ధృతంగా సాగిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది.

గఢ్వా జిల్లా కండి బ్లాక్‌లోని ప్రభుత్వ ప్లస్ టూ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మలయ్ కుమార్ సింగ్‌ను అధికారులు ఇటీవల బదిలీ చేశారు. ఆయన హయాంలో పాఠశాల గణనీయమైన అభివృద్ధి సాధించిందని భావించిన విద్యార్థులు, ఈ బదిలీని తీవ్రంగా వ్యతిరేకించారు. పలువురు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కండి–భవనాథ్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. “మా సార్ మాకే కావాలి” అంటూ నినాదాలు చేస్తూ గంటల తరబడి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. గురువారం నాడు ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నచ్చజెప్పేందుకు వచ్చిన కండి బ్లాక్ చీఫ్ సత్యేంద్ర పాండే, ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయన వాహనంపై దాడి చేశారు. రక్షణ కోసం ఆయన సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం

పొందగా, కొందరు విద్యార్థులు స్టేషన్‌పైకి రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి తలకు గాయమైంది.పరిస్థితి తీవ్రతను గమనించిన ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విద్యార్థులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్‌కు అంగీకరిస్తూ ప్రధానోపాధ్యాయుడు మలయ్ సింగ్ బదిలీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో ఫోన్‌లో ఆయనను మాట్లాడించడంతో వారు శాంతించి, తమ ఆందోళనను విరమించారు.

# విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన ‘రచనాత్మక్ కాంగ్రెస్’ జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు.ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు.బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక ‘జోకర్ల బృందం’గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

## చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు ‘రెడ్ బుక్’ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళు అవమానించే సంస్కృతిని తెచ్చారు” అని అన్నారు.ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. “ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు” అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు.

“ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ” అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు.దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు.ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

## విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు.. ప్రారంభించిన రామ్మోహన్

- మొదటి పేజి తరువాయి

నడపను న్నారు.ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్–2, టైర్–3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ–వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు. మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముందు భారత్‌కు తిరిగి రండి..

## ఆ తర్వాతే పిటిషన్ విచారిస్తాం

- మొదటి పేజి తరువాయి

తలదాచుకుంటూ, భారతీయ న్యాయస్థానాల పరిధికి లొంగకుండా క్రిమినల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరని కోర్టు వ్యాఖ్యానించింది. విజయ్ మాల్యా వేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ఒకేసారి విచారించలేమని, విదేశాల్లో ఉంటూ రాజ్యాంగబద్ధతను సవాలు చేసే పిటిషన్‌ను కొనసాగించలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత్‌కు తిరిగి వస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని సూచిస్తూ, ఆయన ఎప్పుడు తిరిగి వస్తారో సమయపాలనతో కూడిన వివరణ ఇవ్వాలని ఆదేశించింది.మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా... పరారీలో ఉన్న నేరస్థులు విచారణకు సహకరించకుండా కోర్టులను ఆశ్రయించకుండా ‘పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం’ చట్టంలోని సెక్షన్ 14 అడ్డుకుంటుందని తెలిపారు. బ్రిటన్‌లో మాల్యా అప్పగింత ప్రక్రియ ఆఖరి దశకు చేరుకుందని, ఇలాంటి పిటిషన్లతో ఆ ప్రక్రియకు ఆటంకం కలగకూడదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, పిటిషన్ వెనక్కి తీసుకుంటారా? లేదా భారత్‌కు తిరిగొచ్చే తేదీని ఖరారు చేస్తారా? అని ప్రశ్నిస్తూ హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

## తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

తిరుమల తిరుపతి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ , నర్సాపురం జనసేన శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ తదితరులు దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## మళ్లీ మొదలైన ఇసుక లొల్లీ..!

### నెల రోజుల క్రితం నిరసనలతో దద్దరిల్లిన మండలం..

### మళ్లీ తెరపైకి ఇసుక వ్యవహారం

### లారీ యజమాని -పోలీసుల మధ్య వాగ్వాదం..

### నిబంధనలు అందరికీ సమానంగా అమలు చేయాలని డిమాండ్.



**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 13**

పుల్లల చెరువు మండలంలో ఇసుక వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నెల రోజుల క్రితం ఇసుక సమస్యపై పెద్ద ఎత్తున నిరసనలు జరగడంతో పాటు, ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాజాగా ఇసుక రవాణా, వసూళ్ల అంశాలు మళ్లీ తెరపైకి రావడంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇసుక రవాణాకు సంబంధించి అదనపు వసూళ్లు జరుగుతున్నాయంటూ కొందరు ఆరోపిస్తున్నారు.లారీకి అనుమతుల పేరుతో టన్నుకు రూ.1,200 నుంచి రూ.1,300 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. దీంతో ఇల్లు నిర్మించుకునే సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై ఇసుక భారం మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**లారీ యజమాని--పోలీసులమధ్య వాగ్వాదం...:** ఇదిలా ఉండగా ఇసుక రవాణా విషయంలో బుధవారం రాత్రి సమయంలో ఓ లారీ యజమానికి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. తమ వాహనానికి బిల్లులు, అవసరమైన పత్రాలు ఉన్నప్పటికీ ఎందుకు అడ్డుకుంటున్నారని లారీ యజమాని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆర్టీవో విధించిన జరిమానాను కూడా 'మీ సేవ' ద్వారా చెల్లించామని వారు పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి,ఇసుక లారీని పోలీస్ స్టేషన్ తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనలు అందరికీ సమానమేనా..?**

తమ వాహనానికే నిబంధనలు వర్తింపజేసి, మరికొన్ని వాహనాల విషయంలో పట్టించుకోవడం లేదని కొందరు లారీ యజమానులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇసుక రవాణా చేసే ప్రతి వాహనాన్ని ఒకే విధంగా తనిఖీ చేసి, బిల్లులు, అనుమతులు, రవాణా పత్రాలను పరిశీలించాలని వారు కోరుతున్నారు.ఇసుక వ్యవహారంలో అక్రమాలకు తావులేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అదనపు వసూళ్ల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.నెల రోజుల క్రితం జరిగిన పరిణామాలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కేజీబీవీలో నీటి కష్టాలు..

## రోడ్డెక్కిన బాలికలు..!

### నాలుగు రోజులుగా నీటి కోసం అవస్థలు..

### ఖాళీ బకెట్లతో విద్యార్థినుల నిరసన

### కనీస వసతులు కల్పించలేని దుస్థితిపై తీవ్ర విమర్శలు

### ఎస్వో, అధికారుల నిర్లక్ష్యంతో సమస్య తీవ్రతరం?





**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 13**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత నాలుగు రోజులుగా నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. తాగునీరు, వ్యక్తిగత అవసరాలు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత వంటి కనీస అవసరాలకు సైతం నీరు అందుబాటులో లేకపోవడంతో బాలికలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.ఇన్ని రోజులుగా సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో గురువారం ఉదయం విద్యార్థినులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారు. చేతుల్లో ఖాళీ బకెట్లతో రోడ్డుపై కనిపించిన బాలికలు తమకు ఎదురవుతున్న నీటి కష్టాలను నిరసన రూపంలో తెలియజేశారు. పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థినులు కనీస అవసరాల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.కేజీబీవీలో గత నాలుగు రోజులుగా నీటి సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నీటి సరఫరా నిలిచిపోవడంతో బాలికలు తమ రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. వసతి గృహంలో ఉంటూ చదువుకునే విద్యార్థినులకు నిరంతర నీటి సరఫరా అత్యంత అవసరం.అయితే రోజుల తరబడి సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లిఖాళీ బకెట్లతో నిరసనలి

తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థినులు ఖాళీ బకెట్లతో రోడ్డుపైకి రావడం చర్చనీయాంశంగా మారింది.నీటి కోసం విద్యార్థినులు రోడ్డెక్కిన దృశ్యాలు చూసిన స్థానికులు అధికారుల పనితీరుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, తరగతి గదులతో పాటు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అలాంటి వసతుల్లో ఒకటైన నీటి సమస్యను కూడా పరిష్కరించలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని పలువురు అంటున్నారు.కేజీబీవీ వంటి బాలికల వసతి పాఠశాలలో నీటి సమస్య తలెత్తడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం, విద్యాసంస్థల్లో కనీస వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.విద్యార్థినులు తరగతి గదుల్లో కూర్చొని చదువుకోవాల్సిన సమయంలో నీటి కోసం ఖాళీ బకెట్లతో రోడ్డుపైకి రావాల్సి రావడం విద్యావ్యవస్థలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.కేజీబీవీ ఎస్వోతో పాటు సంబంధిత అధికారులు నీటి సమస్యను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకుని ఉంటే విద్యార్థినులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు.సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే పరిస్థితి తారస్థాయికి చేరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినుల సమస్యను ఇకనైనా అధికారులు అత్యవసరంగా పరిగణించి నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.కేజీబీవీ విద్యార్థినుల నీటి సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతో పాటు పాఠశాలకు నిరంతర నీటి సరఫరా ఉండేలా శాశ్వత ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతతో ముడిపడి ఉన్న అంశం కావడంతో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థినులు రోడ్డెక్కిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, అసలు నీటి సమస్యకు కారణమేంటో గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక సమస్యను తాత్కాలికంగా పరిష్కరించి చేతులు దులుపుకుంటారా? అనేది వేచి చూడాల్సిందే.

## అద్దెలు ఆకాశానికి..

## సామాన్యుడు గగ్గోలు

### వెలుగొండ వలసలతో రెచ్చిపోతున్న ఇంటి యజమానులు

### ఖాళీ అవుతున్న గ్రామాలు.. అద్దె ఇంటి కోసం పాట్లు

### వెలుగొండ నిర్వాసితుల రాకతో రెండింతలైన అద్దెలు






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**

జిల్లా కేంద్రమైన మార్కాపురంలో ఇంటి అద్దెలు అమాంతంగా పెరిగిపోయి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలైనా కన నూతల, గున్నంచర్ల, సుంకేసుల, గొట్టిపాడియా గ్రామాల ప్రజలు అక్కడ ఖాళీ చేసి ఇక్కడికి వలస రావడాన్ని అదునుగా తీసుకున్న ఇంటి యజమానులు అద్దెలను రెండింతలు పెంచేస్తున్నారు.

**" వెలుగొండ వలసలతో భారీగా డిమాండ్ ..**

వెలుగొండ ముంపు గ్రామాల ప్రజలు ఉపాధి, పిల్లల చదువుల కోసం పెద్ద సంఖ్యలో మార్కాపురానికి వస్తున్నారు. దీంతో అద్దె ఇళ్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. గతంలో 5000 కు దొరికే డబుల్ బెడ్ రూమ్ ఇప్పుడు 8000 నుంచి 10000 అడుగుతున్నారు" అని ఓ నిర్వాసితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**' ఇదే అదునుగా రెండింతల అద్దెలు..**

ఇంటి యజమానులు పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఇష్టారీతిన అద్దెలు పెంచుతున్నారు. వలస వచ్చే వాళ్లు ఎక్కడికైనా ఉండాల్సిందే అన్న ధోరణితో మూడు నెలల నుంచి ఆరు నెలలు వరకు అడ్వాన్స్ డిమాండ్ చేస్తున్నారు. దీంతో పేద కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

**జిల్లా కేంద్రం.. ఉద్యోగుల రద్దీ..:** మార్కాపురం జిల్లా కేంద్రం కావడం, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కోర్టులు, కళాశాలలు, హాస్పిటల్స్ ఇక్కడే ఉండటంతో ఉద్యోగస్తులు, విద్యార్థులు, వ్యాపారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో అద్దె ఇళ్లకు ఎప్పుడూ కొరత నెలకొంది.

**మధ్యతరగతి, కూలీలకు కంట కన్నీరు..**

పెరిగిన అద్దెల భారం మధ్యతరగతి, కూలీ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శివారుల్లో చిన్న గదులు కూడా 5000 నుంచి 6000 పలుకుతున్నాయి. జీతం మొత్తం అద్దెకే సరిపోతోంది. ఇల్లు గడవడం కష్టంగా ఉంది అని ఓ ప్రభుత్వ ఉద్యోగి వాపోయారు.

**'నియంత్రణ కోసం ప్రజల డిమాండ్..**

అద్దెల పెంపుపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో యజమానులు రేట్లు విచ్చలవిడిగా పెంచుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అద్దెలపై ఒక విధానం తీసుకురావాలని, నిర్వాసితులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.వెలుగొండ నిర్వాసితులకు ఆశ్రయం ఇవ్వాల్సిన మార్కాపురంలోనే వారిపై అద్దెల భారం పడుతోంది. అభివృద్ధితో పాటు సామాన్యుడి జీవనాన్ని కాపాడే చర్యలు తీసుకోకపోతే పేదలు పట్టణంలో బతకలేని పరిస్థితి వస్తుంది.

## వికసిత భారత్..

### స్వర్ణాంధ్ర సాధన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు

### జాతీయ పతాకాన్ని చేబూని

### ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ప్రజలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**



ప్రతి ఒక్కరం ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించుకుని వికసిత భారత్, స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలకు అనుగుణంగా తమ వంతు బాధ్యత నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు త్రివర్ణ శోభితమయింది. గురువారం ఉదయం విద్యార్థులు, వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది, ప్రజలు, స్థానిక ప్రముఖులు సుమారు 3వేల మంది జాతీయ పతాకాలను చేతబూని చేపట్టిన ర్యాలీతో ట్రంక్ రోడ్ కిక్కిరిసింది. వివిధ యూనిఫారాలు ధరించి ప్రకాశం భవనం నుంచి మినీ స్టేడియం వరకు జరిగిన మారథాన్ ర్యాలీ, వందేమాతరం నినాదాలతో సాగింది. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో దేశ భక్తిని పెంచి స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని నింపింది. మినీ స్టేడియంలో ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేటి మన స్వతంత్ర భారతదేశం అన్నారు. ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. అన్ని రంగాలలో దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మరింత సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్య పోరాట విలువలను భావితరాలకు తెలిపేలా ఐదు రోజులపాటు హర్ ఘర్ తిరంగా, సెల్ఫీ, మొక్కలు నాటడం, తిరంగా ర్యాలీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రతి ఒక్కరూ వీటిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా పాల్గొంటామంటూ ఈ ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ మారథాన్ ర్యాలీలో డీఆర్వో పి.వి. రమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఆర్డిఏ పిడి నారాయణ, డీఈవో రేణుక, డ్వామా పిడి జోసఫ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఐసిడిఎస్ పిడి పద్మ సునంద, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, స్టెప్ సీఈవో రమణ, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి రవికుమార్, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిటిసి సుశీల, డి.ఎస్.పి. శ్రీనివాసరావు, ఏపీఎస్ ఆర్టీసీ సూపర్వైజర్ ఫణి కుమార్, మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డిఎస్డివో రాజరాజేశ్వరి, యువజన వ్యవహారాల అధికారి నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దామచర్ల



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 12**

ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ తిరుమల లోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులు పార్టీ నాయకులతో కలిసి బుధవారం స్వామి వారిని దర్శించుకున్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి కూడా దామచర్ల జనార్ధన్ తో పాటు శ్రీవారిని దర్శించుకున్నారు.

## జాతీయ జెండాతో సీఐ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల సైకిల్ ర్యాలీ

**పట్టణ ప్రజలకు జాతీయ సమైక్యత, దేశభక్తిపై అవగాహన**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గిద్దలూరు పట్టణంలో జాతీయ భావాన్ని చాటిచెప్పేలా భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఐ కె. సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ర్యాలీని ప్రారంభించి స్వయంగా విద్యార్థులతో కలసి సైకిల్ తొక్కుతూ ముందుండి నడిపించారు. ఉత్సాహంగా విద్యార్థులు పట్టణంలోని పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో పట్టణ వీధులను హోరెత్తించారు. దేశ స్వాతంత్ర్య పోరాట త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీకి స్థానిక వ్యాపారులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జవహర్ నవోదయ, ఎన్ఎంఎస్ పరీక్షలపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

**పాలుగున్నా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు**






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జవహర్ నవోదయ మరియు నేషనల్ మీన్స్, మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు మార్కాపురం బాలికోన్నత పాఠశాలలో గురువారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును విద్యాశాఖ గౌరవ అడిషనల్ డైరెక్టర్ ఏ. సుబ్బారెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉన్నత పాఠశాలల్లో ఎన్ఎంఎంఎస్ బోధించే ఉపాధ్యాయులు దాదాపు 700 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు జవహర్ నవోదయ, ఎన్ఎంఎస్ పరీక్షలపై పూర్తి అవగాహన కల్పించాలి. ఈ పోటీ పరీక్షలు భవిష్యత్తులో ఉన్నత పరీక్షలు రాయడానికి పునాది వేస్తాయి. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీసుకురావడానికి ఇవి ఎంతో దోహదపడతాయి. ప్రాథమిక పాఠశాలల్లో వంద రోజులపాటు మిషన్ నవోదయ కార్యక్రమాన్ని, ఉన్నత పాఠశాలల్లో మిషన్ ఎన్ఎంఎంఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయుడికి గౌరవం లభిస్తుంది- అని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలి. తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు పిల్లల అభివృద్ధి గురించి చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు పి. శ్రీనివాసులు, జి. సంజీవి, ఏసిఆర్ కొండారెడ్డి, డిఎంఓ డి. రామిరెడ్డి, జవహర్ నవోదయ వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి, మార్కాపురం ఎంఈఓలు రాందాస్ నాయక్, శార్వాణి, గిరిధర్ శర్మ, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ చారి, నరసింహారావు, పెద్దిరాజు, ఆంజనేయులు, వివిధ మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# అవయవ దానం .. జీవన దానం - జిల్లా కలెక్టర్ రాజాబాబు

### - కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు ఆధ్వర్యంలో 3 కిలోమీటర్ల అవగాహన వాక్

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**

అవయవ దానం ప్రాణాలను కాపాడే మహత్తర సేవ అని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ మహోన్నత కార్యానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవ దానం దినోత్సవం సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు ఆధ్వర్యంలో బుధవారం 3 కిలోమీటర్ల అవగాహన వాక్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు, జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వాక్‌ను ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాస్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చు. సమాజంలో అవగాహన పెరిగితే మరింత మంది ముందుకు వచ్చి అవయవ దానం చేయడానికి సిద్ధపడతారు. ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ అవగాహన వాక్ కలెక్టర్




కార్యాలయం నుండి ప్రారంభమై ఎస్పీ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, మెడికల్ విద్యార్థులు, వాలంటీర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.




ప్లకార్డులు, నినాదాలతో వారు అవయవ దానం పై చైతన్యం పెంపొందించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిఓఓ కె.అంకిరెడ్డి, డాక్టర్ టి. శ్రీ హరి రెడ్డి, పలువురు కన్సల్టెంట్లు, వైద్యులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

### - జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు - తిరంగా సైకిల్ ర్యాలీ నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, మాట్లాడుతూ, జాతీయ జెండా మనందరి గర్వానికి ప్రతీక అని, దేశ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాన్ని మరింతగా పెంపొందించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, దేశ సమగ్రత, ఐక్యత, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) యన్.యుగంధర్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఒంగోలు టూ టౌన్ సీఐ వీర నాయక్, ఒంగోలు రూరల్ సీఐ శేషారిగి రావు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, ఆర్ఐలు సీతారామిరెడ్డి, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు ఏఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంగోలు - గుంటూరు సెక్షన్ లో నూతన రైల్వే లైన్ల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**

ఆంధ్రప్రదేశ్ లోని ఒంగోలు.. గుంటూరు సెక్షన్ లో మంజూరైన, నిర్మాణంలోని రైల్వే ప్రాజెక్టులు, ఒంగోలు పక్క జిల్లాలలో నూతన అనుసంధాన రైల్వే లైన్ల ఏర్పాటు, స్థాయి పెంపుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు, నిధులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి, అశ్విని వైశ్నవ్ సమాధానమిస్తూ.. ఒంగోలు -- విజయవాడ -- గూడూరు అనుసంధానాన్ని పెంచుటకు 287 కి.మీ. 3 వ లైన్ నిర్మించబడుచున్నదని, ఒంగోలు -- గుంటూరు పట్టణాలు తెనాలి జంక్షన్ తో ఇప్పటికే అనుసంధానించబడిందని తెలిపారు. ఈ సెక్షన్ లో ఒంగోలు -- దొనకొండ 87 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణానికి తుది సర్వే మంజూరయినదని, బలార్షా -- తెనాలి -- ఒంగోలు -- గుంటూరు 782 కి. మీ. 4 లైన్ కు ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేయబడిందని, నడికుడి -- శ్రీకాళహస్తి 309 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణం మొత్తం ఖర్చు రూ.3,407 కోట్లకు గాను, రూ.2,384 కోట్లు ఖర్చు చేయబడిందని, పిడుగురాళ్ళ -- శావల్యాపురం 46 కి. మీ., గుండ్లకమ్మ - కనిగిరి 79 కి.మీ. ప్రాజెక్ట్స్ రిపోర్టులు ప్రారంభించబడ్డాయని తెలిపారు. వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్టు తయారయిన పిదప, సంబంధిత వివిధ వాటాదారుల ను సంప్రదించిన మీదటే రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయబడునని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి, రైల్వే ప్రాజెక్టులకు 2009 నుండి 2024 వరకు సంవత్సరానికి రూ.886 కోట్లు ఖర్చు చేయబడగా, 2026-27 ఒక్క సంవత్సరానికి రూ.10,134 కోట్లు ఖర్చు చేయబడిందని, 2026 ఏప్రిల్ 01 నాటికి 12 నూతన, 30 డబ్లింగ్ ప్రాజెక్టులు మొత్తం 4,768 కి.మీ. రూ.27,851 కోట్ల వ్యయంతో నిర్మించబడుచున్నాయని, అందులో 12 ప్రాజెక్టులు ఈ మధ్యనే పూర్తయినాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

# విద్యార్థినులకు గుక్కెడు నీరు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం..!

### మండల పరిషత్ నిధులతో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని వైసీపీ నేతల డిమాండ్

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 13**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నెలకొన్న తీవ్ర నీటి సమస్యపై వైసీపీ నాయకులు స్పందించారు.విద్యార్థినులు నాలుగు రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న బాలికలకు కనీసం తాగునీరు, నిత్యావసరాలకు అవసరమైన నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో విద్యార్థినులు ఖాళీ బకెట్లతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు గురువారం పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి కి వినతిపత్రం అందజేశారు. కేజీబీవీలో నెలకొన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, శాశ్వత పరిష్కారం లభించే వరకు మండల పరిషత్ నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి విద్యార్థినుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లింగంగుంట్ల రాములు మాట్లాడుతూ కేజీబీవీలో వందలాది మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, వారికి కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.నాలుగు రోజులుగా నీటి సమస్య కొనసాగుతున్నా అధికారులు స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.మండల పరిషత్ నిధులు కూటమి నాయకుల స్వప్రయోజనాలకు ఉపయోగించకుండా.. విద్యార్థినుల కోసం ఖర్చు చేయాలి. కేజీబీవీ బాలికలకు వెంటనే ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలి అని రాములు డిమాండ్ చేశారు.విద్యార్థినులు నీటి కోసం ఖాళీ బకెట్లతో రోడ్డుపైకి వచ్చే పరిస్థితి రావడం ప్రభుత్వ పాలనలోని వైఫల్యానికి అద్దం పడుతోందని ఆయన అన్నారు. బాలికల విద్య, సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం.. ఒక



పాఠశాలకు కనీసం నీటి సౌకర్యం కల్పించలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోర్లకుంట జానకీ రఘు మాట్లాడుతూ ఇదేనా కూటమి ప్రభుత్వం విద్యార్థినులపై చూపుతున్న ప్రేమ?" అంటూ ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విద్యార్థినుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని సూచించారు. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి బాలికలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, భవిష్యత్తులో నీటి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.కేజీబీవీ విద్యార్థినుల నీటి సమస్యపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వైసీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు కంచర్ల దినేష్, వైసీపీ నాయకులు కంచర్ల కొండలు, నక్క గంగురాజు పాల్గొన్నారు.

# నేడు మరో 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 13**

కొమరోలు మండలంలోని కొమరోలు విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని 10 గ్రామాలకు ఈనెల 14వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటులో ఈనెల 14వ తేదీ శుక్రవారం కొమరోలు విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని సూరవారి పల్లి, బాదినేనిపల్లి, బొడ్డువానిపల్లి, మొట్టుపల్లి, బెడుసుపల్లి, రామవారిపల్లి,,



గుంతపల్లి,బావాపురం, పోసుపల్లి,గోపాని పల్లి, గ్రామాలలో శుక్రవారం కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. కావున సదరు 10 గ్రామాలకు ఈనెల 14 వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# పాలయాకరులు అభివృద్ధికి కృషి చేస్తా

### సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కందూరి నాగేశ్వరరావు నాయుడు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 13**

రాష్ట్రంలో పాలయాకరులు అన్ని విధాల అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలయాకర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కందూరి నాగేశ్వర నాయుడు తెలిపారు మండలంలోని మైలుచర్ల గ్రామంలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి రాష్ట్రంలో ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు అలాగే ఆ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు రాష్ట్రంలో పాలయాకరులు అన్ని విధాల అభివృద్ధి చెందే విధంగా తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు వారి అభివృద్ధి కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు పాలయాకరుల్లో విద్య మరియు ఆర్థికపరంగా అభివృద్ధి చెందినప్పుడే వారు అన్ని రంగాల్లో ముందు ఉంటారని తెలిపారు అనంతరం గ్రామంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాలయాకర సంక్షేమ సంఘం కార్పొరేషన్ మాజీ చైర్మన్ టి మురళీధర్ నాయుడు టిడిపి నాయకులు దొర రంగస్వామి గొర్ల అల్లూరయ్య జెన్నే వరదరాజులు కానగారి రామలింగయ్య కొండమల్లు నారాయణ దొర అల్లూరయ్య, లక్కమనేని సుబ్బయ్య, ఆవులనారు నాయుడు తదితరులు పాల్గొన్నారు

# ఎలాంటి భద్రతా లోపం తలెత్తకుండా చర్యలు చేపట్టాలి - ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

## - స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను.. వేడుకల పరేడ్ రిహార్సల్స్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**

పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15 న ఘనంగా జరిగే 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ ను బుధవారం జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు పరిశీలించారు. రిహార్సల్స్ లో భాగంగా ముందుగా సిబ్బంది నుండి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకం ఎగుర వేశారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి కవాత్ ను నిర్వహించడం లో కొన్ని సూచనలు, మెళుకువలు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మరింత ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, తదితర వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, విద్యార్థులు, ప్రజలకు కల్పించాల్సిన భద్రత, సౌకర్యాలను సమీక్షించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) యన్. యుగంధర్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ వీర నాయక్,ఒంగోలు రూరల్ సీఐ శేషారిగి రావు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హాజరత్తయ్య, ఆర్ఐలు సీతారామిరెడ్డి, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు ఏఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముమ్మరంగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

## పోలీస్ పరేడ్ రిహార్సల్స్ పరిశీలించిన ఎస్పీ





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**

ఈ నెల 15వ తేదీన ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు గురువారం పరిశీలించారు. పరేడ్ ప్రాంగణం, వేదిక, భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, ప్రజలకు కావాల్సిన సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం పోలీస్ పరేడ్ రిహార్సల్స్ ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పరేడ్ వాహనంలో కవాతును చూసి క్రమశిక్షణ, సమన్వయంపై సిబ్బందికి సూచనలు చేశారు. రోజున రెట్టించిన ఉత్సాహంతో కవాతు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డి నవజ్యోతి మిశ్రా, ఎస్ బి ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, డిఎస్పీ యు.నాగరాజు, ఆర్ ఐ రమణారెడ్డి, పట్టణ ఎస్సై విశ్వనాథరెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్.సి.సి క్యాడెట్లకు రక్త పరీక్షల రాజు, సాయి పారామెడికల్ కాలేజీ సౌజన్యంతో బ్లడ్ టెస్టులు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

పట్టణంలోని పీఎంశ్రీ హై స్కూల్ ప్లస్ పాఠశాల వేదికగా ఎన్.సి.సి క్యాడెట్లకు ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక 'రాజు , సాయి పారామెడికల్ కాలేజీ' సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ బలరాం విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కేవలం రక్త పరీక్షలు చేయడమే కాకుండా.. రక్త నమూనాలు సేకరించే విధానం, వాటిని ల్యాబ్‌లో పరిశీలించే ప్రత్యక్ష పద్ధతులను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఎన్.సి.సి విద్యార్థుల ఆరోగ్య శ్రద్ధను దృష్ట్యా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించిన రాజు సాయి పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు, కరస్పాండెంట్ శంకర్ లకు హెచ్ఎం సిద్దేశ్వరశర్మ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి అధికారి డాక్టర్ మొర్రి పిచ్చయ్యతో కళాశాల సిబ్బంది శ్రీరామి రెడ్డి, పీరయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ముత్తుముల కృషితో, విద్యా రంగంలో గిద్దలూరు నియోజకవర్గం ముందడుగు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

గిద్దలూరు నియోజకవర్గంలోనే పుట్టి, ఇక్కడే అంచలంచలుగా ఎదుగుతూ, నేడు అదే నియోజకవర్గానికి శాసనసభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన ముత్తుముల అశోక్ రెడ్డి తన ప్రాంతంపై ఉన్న మమకారంతో అభివృద్ధి, సంక్షేమమే ఏకైక లక్ష్యంగా దీక్ష పూని నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలను అందించాలనే తపనతో ఆయన అన్ని రంగాలను సమన్వయం చేసుకుంటూ పాలనలో తనదైన ముద్రను నెలకొల్పారు. ముఖ్యంగా నియోజకవర్గంలో విద్యను పేద, బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన రీతిలో అందించాలనే దృఢ సంకల్పంతో, విద్యాభివృద్ధికి అవసరమైన ముందస్తు ప్రణాళికలను రూపొందిస్తూ ఆయన ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వెనుకబడిన వర్గాలకు ఉన్నత చదువులను చేరువ చేయడంలో భాగంగా, నియోజకవర్గ చరిత్రలోనే ఇప్పటివరకు బీసీ బాలురకు ప్రత్యేక వసతి గృహం లేని లోటును గుర్తించి, ఏకంగా రూ. 50 కోట్ల రూపాయల భారీ నిధులతో బీసీ బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేయించారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం లోనే తర్గతులుప్రారంభించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం అద్దె భవనంలో దానిని ప్రారంభించడం గిద్దలూరు నియోజకవర్గానికి ఒక వరం, అది ఎంతో మేలు చేకూర్చింది. ఇదే బాటలో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం మరో రూ. 16 కోట్ల రూపాయల వ్యయంతో ఎస్టీ వసతి గృహం మరియు పాఠశాల నిర్మాణ పనుల కోసం నిధులను మంజూరు చేయించారు. వీటితో పాటుగా దళిత విద్యార్థుల వసతి గృహాల రూపురేఖలను మార్చేందుకు, నియోజకవర్గంలోని ఎస్సీ హాస్టల్స్ సమగ్ర అభివృద్ధి , ఆధునీకరణ కోసం ప్రత్యేకంగా రూ. 6 కోట్ల రూపాయల నిధులను కూడా మంజూరు చేయించి ముందడుగు వేశారు. అంతేకాకుండా, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో బెస్తవారిపేటలో ప్రతిష్టాత్మకమైన లీప్ స్కూల్‌ను ఏర్పాటు చేయించడం నియోజకవర్గ విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ,యువ నాయకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి సహకారంతో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్ని వర్గాలను, అన్ని రంగాలను సమపాళ్ళలో ముందుకు నడిపిస్తూ ఎనలేని కృషి చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు , తరగతి గదుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఎమ్మెల్యే అనేకమార్లు స్వయంగా



కలిసి ఇక్కడి క్షేత్రస్థాయి సమస్యలను వారికి విన్నవించి, పెద్ద ఎత్తున నిధులు రాబట్టారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలనే ఆశయంతో, పాఠశాలల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు మంచినీటి బోర్లు వేయించడంతో పాటు, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్లను సమకూర్చారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో రవాణా ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో, అనేక గ్రామాల నుండి పాఠశాలలకు బస్సు సౌకర్యాలు లేవని తెలుసుకొని, విద్యార్థులు తగిన సమయానికి విద్యా సంస్థలకు చేరుకునేలా ప్రత్యేక బస్సు రవాణా సౌకర్యాలను కూడా కల్పించారు. ఈ విధంగా సొంత నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలనే గట్టి సంకల్పంతో, నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కృషి పట్టుదల వల్లనే నేడు గిద్దలూరు నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతోందనడంలో సందేహంలేదు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అద్భుతమైన మార్పులను, అభివృద్ధి పనులను కళ్లారా చూస్తున్న నియోజకవర్గ ప్రజలంతా ఎమ్మెల్యే పై హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన చేస్తున్న అలుపెరగని కృషికి తమ గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ ఎల్లప్పుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ పనులు, నిర్వాసితుల సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి -మంత్రులు నిమ్మల, ఆనం





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పనులు, కాలనీల పురోగతి, ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు, వారి డిమాండ్ల పరిష్కారంపై గురువారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, మార్కాపురం జిల్లా ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు.ప్రాజెక్ట్ పనుల పురోగతిని అధికారులు వివరించారు. నిర్వాసితుల పునరావాసం, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, పెండింగ్ సమస్యలు, నిర్వాసితులు ప్రతిపాదించిన డిమాండ్లపై సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్ట్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్, పాఠశాలలు వంటి ప్రాథమిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. నిర్వాసితుల సమస్యలను సానుభూతితో పరిష్కరించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ సునీత, ప్రకాశం పార్లమెంట్ అధ్యక్షులు,కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, వెలిగొండ ప్రాజెక్ట్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీగా హర్ ఘర్ తిరంగా

## వందేమాతరం నినాదాలతో దద్దరిల్లిన పాఠశాల ప్రాంగణం





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 13**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ సూచనలతో సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు పర్యవేక్షణలో ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సంతమాగులూరు మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు వందేమాతరం నినాదాలతో పాఠశాల ఆవరణ ప్రాంగణమంతా దద్దరిల్లింది. పోలీసులు జాతీయ జెండా ప్రాముఖ్యత, దేశభక్తి, జాతీయ ఐక్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోలినేని సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతీయ జెండా దేశ స్వాతంత్ర్యానికి, ప్రజల ఐక్యతకు, దేశభక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ హనుమంతరావుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ పథకాన్ని ఎగరవేయాలని హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో విద్యార్థులందరితోపాటు ప్రతి పౌరుడు బాధ్యతగా నెలగాలని వారు తెలిపారు.

# డి జి పేటలో వృద్ధురాలు హత్య



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 13**

మండలంలోని డీజి పేట సమీపంలోని పొలంలో బంగారు నగల కోసం పావలి వెంకటసుబ్బమ్మ (65) వృద్ధురాలని కత్తితో దాడి చేసి బంగారు నగలు దోచుకొని పారిపోయిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది డీజి పేటకు చెందిన పావలి వెంకటసుబ్బమ్మ రోజు మాదిరిగా తన పొలంలోని పశువుల మేత గడ్డి తెచ్చేందుకు గురువారం ఉదయం వెళ్లి తెచ్చుకొని మరల మధ్యాహ్నం భోజనం చేసి పశువుల మేత గడ్డి తీసుకొని వస్తుండుగా గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలు వెంకటసుబ్బంపై కత్తులతో దాడి చేసి ఆమెపై ఉన్న బంగారు నగలు దోచుకు వెళ్లారు వెంకటసుబ్బమ్మ ముక్కుపై ఉన్న బంగారం కోసం ముక్కుపై కత్తితో దాడి చేశారు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు మరియు ఇన్చార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉప్పు శ్రీనివాసులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వృద్ధురాలు మృతదేహాన్ని పరిశీలించారు అనంతరం సంఘటన స్థలానికి వెళ్లారు హత్య జరిగిన సంఘటన స్థలాన్ని కనిగిరి క్లూస్ టీం ఏ ఎస్ ఐ రవి ఆధ్వర్యంలో ఆధారాలను సేకరిస్తున్నారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దాం

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**



వందేమాతరం స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆగస్టు 17 వరకు నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సూచించారు. త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు 'వందేమాతరం' స్ఫూర్తితో దేశం పట్ల గౌరవం, జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన అన్నారు. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చేసి, దేశభక్తి భావాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. వందేమాతరం నినాదంతో దేశ సమైక్యతను చాటుతూ.. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. గర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యం

## మార్కాపురంలో ఘనంగా తిరంగా ర్యాలీ





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 14**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మార్కాపురం జిల్లా కేంద్రంలో గురువారం ఓఎస్డి నవజ్యోతి మిశ్రా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దేశ నిర్మాణంలో భాగస్వాములం అనే నినాదంతో ఈ ర్యాలీ సాగింది.స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ర్యాలీ ప్రారంభమైంది. విద్యార్థులు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను చేతపట్టుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ప్రగతిలో మన వంతు,దేశ సేవలో మన బాధ్యత,ఐక్యత క్రమశిక్షణ దేశభక్తి వంటి నినాదాలతో పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఓఎస్డి నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో దేశసేవా భావాన్ని పెంపొందించేందుకే ఈ ర్యాలీని చేపట్టామన్నారు.దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.క్రమశిక్షణతో, బాధ్యతతో ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.ర్యాలీకి ప్రజలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి యు. నాగరాజు, సీఐ మహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్, ఎస్.ఐ లు విశ్వనాథ్ రెడ్డి, వి. వేమనతో పాటు పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి- బిజెపి నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

దేశభక్తి భావాన్ని ప్రతి ఇంటికీ చాటిచెప్పేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గిద్దలూరులో విజయవంతంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ కోరారు . ఈ సందర్భంగా అప్పిశెట్టి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపైనా భారత జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. జాతీయ జెండా పట్ల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గిద్దలూరు పట్టణంలోని ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడేలా బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, దేశభక్తికి త్రివర్ణ పతాకం ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ వలీ షఫీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మైనార్టీ మోర్చా, ముప్పూరి శ్రీనివాసులు, కొప్పారపు నాగేశ్వరరావు పట్టణ ఉపాధ్యక్షులు, రామకృష్ణ పట్టణ ఉపాధ్యక్షులు, వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రవి, వాసు, రమేష్ , శ్రీధర్ ,బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# నేడే ఎమ్మెల్యే ముత్తుముల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9:30 గం " ని " లకు గిద్దలూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుండి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు " హర్ ఘర్ తిరంగా ర్యాలీ " నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.






# జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతో ఉపయోగకరం - సీడీపీఓ సుధాలి

## క్షేత్రస్థాయిలో ప్రీస్కూల్ విద్యా బోధన మరింత సమర్థవంతంగా అమలు చేయాలి





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 13**

సంతమాగులూరు మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యా విధానాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సిడిపిఓ సుధా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుధా మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గురువారం సంతమాగులూరులో సీడీపీఓ సుధా ఆధ్వర్యంలో జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మూడో రోజు విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె ఉపన్యాసం చేసి, అంగన్వాడీ టీచర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను శ్రద్ధగా అవగాహన చేసుకుని, అంగన్వాడీ కేంద్రాల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యా విధానంలో పిల్లలకు మెరుగైన బోధన అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సూపర్వైజర్ ప్రమీల అసెస్మెంట్ విధానంపై వివరించగా, సుష్మా కమ్యూనిటీ భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఎస్జీటీ ఉపాధ్యాయుడు డి.వి. కోటేశ్వరరావు ఇంగ్లీష్ పరిచయం, అంగన్వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్‌ను ఏ విధంగా బోధించాలి, బోధనలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. నాగ సుబ్బారావు, వీరాంజనేయులు మదర్ ఐడియా కార్డుల వినియోగంపై శిక్షణ గురించి వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ ఐక్యతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండలంలోని 70 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.మూడు రోజులుగా కొనసాగిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణకు కొనసాగింపుగా నిర్వహించనున్న తదుపరి కార్యక్రమాల తేదీలను అధికారులు త్వరలో

# ఎమ్మెల్యే దామచర్ల.. మాజీ మంత్రి బాలినేని పరస్పర అవినీతి ఆరోపణలపై కలెక్టర్ విచారణ జరపాలి

## - ఒంగోలు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చుండూరి రవిబాబు డిమాండ్



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 13**

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఇరువురు నువ్వు అవినీతి చేశావ్ కాదు నీ హాయాంలో అవినీతి జరిగిందంటూ ఇటీవల మీడియా ముఖ్యంగా పరస్పరం చేసుకున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ పి రాజా బాబు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని ఒంగోలు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చుండూరి రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల రవిబాబు మాట్లాడుతూ రైతాంగం మొత్తం తీవ్ర కష్టాల్లో ఉందన్నారు. పొగాకు రైతులు ధర్నాలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు చేసిన ప్రభుత్వ స్పందించడం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన పొగాకు ధరలు చూస్తుంటే బ్రహ్మానందం సినిమా కామెడీని తలపిస్తున్నాయన్నారు. ఈ ప్రభుత్వం రైతుల కోసం కాకుండా వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేసే ప్రభుత్వం లా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకం పొగాకు రైతులకు ప్రయోజనం కలిగించకుండా వ్యాపారులకే లాభంగా మారిందన్నారు. కేబుల్ వ్యాపారంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను కుమ్మక్కయానని కొందరు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. మా పార్టీ నాయకులను కార్యకర్తలను తప్పుదోవ పట్టించి వారి మధ్య విభేదాలు సృష్టించాలనే ఉద్దేశంతోనే కొందరు ఇలాంటి నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో తాను ఇక్కడే పోటీ చేయనున్నట్లు వైయస్ జగన్ మోహన్ రెడ్డి తనకు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు రవిబాబు తెలిపారు. ఈ పత్రిక సమావేశంలో నగర వైకాపా అధ్యక్షులు కఠారి శంకర్, వైకాపా నాయకులు లంకపోతు అంజి రెడ్డి, మన్నే శ్రీనివాస్, ఇనగంటి పిచ్చి రెడ్డి, నగరకంటి శ్రీనివాసరావు, పాలడుగు రాజీవ్, ఉప్పలపాటి ఏడుకొండలు (వేణు), వైవి గౌతమ్ అశోక్, పెట్లూరి ప్రసాద్, మలిశెట్టి దేవా, ప్రసన్న, యర్రజర్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

# తృటిలో తప్పిన ప్రమాదం





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

గిద్దలూరు గణేష్‌నగర్ వీధిలో అర్ధరాత్రి విద్యుత్ ప్రమాదం తృటిలో తప్పింది. వీధిలో ఓ భారీ వాహనం వెళ్తుండగా, ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న ప్రధాన విద్యుత్ వైర్లు వాహనానికి తగిలి తెగిపడింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గణేష్‌నగర్ వీధిలో గత 30 ఏళ్లుగా పాత విద్యుత్ స్తంభాలే కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు పాతబడటంతో పాటు విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని చెబుతున్నారు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వైర్లు తగిలే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత స్తంభాలను తొలగించి కొత్త, ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేయాలని, కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇరుకైన వీధుల్లోకి భారీ వాహనాల రాకపోకలపై కూడా నియంత్రణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే గిద్దలూరు , విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గణేష్‌నగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

## జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 13**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు చెప్పారు. గురువారం నాడు పొదిలిలో వీరిశెట్టి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల ఆగమన వేడుకల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల సభలో మాట్లాడిన జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు విద్యాభివృద్ధి తోనే దేశాభివృద్ధి అన్ని విధాల సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. అక్షరం లోనే అభివృద్ధి దాగి ఉందనే నగ్న సత్యాన్ని ఆయన ఈ సందర్భంగా ఉద హరించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత మద్దుల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఆ దశలో ఎటువంటి పొరపాట్లు జరిగినా జీవితం అంధకారం అవుతుందని ఆమె హెచ్చరించారు. కార్యక్రమానికి కిరణ్మయి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ పి.సత్య, మీ వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి.

# విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్‌ను కలిసిన రాచర్ల టీచర్లు



**గిద్దలూరు (రాచర్ల) , పెన్ పవర్ ఆగస్ట్ 13**

పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి మార్కాపురం జిల్లా కేంద్రంలో జరుగుతున్న వివిధ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నవోదయ విద్యాలయ ప్రవేశాలు పొందేలా తగు శిక్షణ ఇవ్వాలని ప్రాథమిక ఉపాధ్యాయులకు సూచించారు. నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పై జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాచర్ల మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

# రైతులు వర్ష భావ పరిస్థితులకు అనుకూలంగా పంటలు సాగు చేయాలి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 13**

రైతులు వర్షాభావ పరిస్థితులకు అనుకూలంగా పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం నాడు మండలంలోని సూదన గుంట, కుంచేపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలినినో పరిస్థితుల మీద పాటించవలసిన సాగులోని మెళుకువలు, జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు వర్షపాతాన్ని బట్టి పంటలు సాగు చేసుకోవాలన్నారు. అలాగే రైతులు సాగు చేసుకోవాల్సిన పంటల గురించి ఆయన రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దయానా, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ ఉమాదేవి తదితరులు కూడా మాట్లాడుతూ రైతులకు పంటల సాగు పట్ల చేపట్టవలసిన పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గ్రామ సహాయకులు శ్రీలేఖ, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దామచర్ల అనూష లక్ష్మి పుట్టినరోజు వేడుకలు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 13**

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కుమార్తె అనూష లక్ష్మి పుట్టినరోజు వేడుకలను 14వ డివిజన్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ టిడిపి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఉంగరాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ బాటలో వారి కుమార్తె డిజేఆర్ ట్రస్ట్ డైరెక్టర్ దామచర్ల అనూషా లక్ష్మి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తండ్రికి తగ్గ తనయగా గుర్తింపు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తి తో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో నేను సైతం ఎప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. శివప్రసాద్ మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు ప్లాన్ చేసి ఉన్నామని వాటిని త్వరలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందుగా డివిజన్ లో ఉత్తమ సేవలందించిన పారిశుధ్య కార్మికులను సన్మానించి, వారికి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉంగరాల అజయ్ బాబు, క్లస్టర్ ఇంచార్జ్ షేక్ కఫిల్ బాషా, ఈపూరు శివప్రసాద్, వాడపల్లి నాగరాజు, కొండవరపు దీప లత, పల్లె మేరీ, కాజా ప్రభాకర్ రావు, చిన్ని సుబ్రహ్మణ్యం, నల్లూరు సుబ్బారావు, గడ్డం కామేశ్వరరావు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**

గిద్దలూరు మండలంలోని ఎన్ బైనపల్లి చంద్రారెడ్డిపల్లి నల్లగట్ల కొంగలవీడు బ్రాహ్మణపల్లి గ్రామాలలో నేడు ఆగస్టు 14. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏ ఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవి లైన్ లో సాంకేతిక మరమ్మత్తులు నిర్వహిస్తుండటంతో ఈ అంతరాయం ఏర్పడుతుందని ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు.

# బెజవాడ పాలిటిక్స్: బుద్ధాకు సరిజోడీ ఉన్నారా.. ?

**హైదరాబాద్ పెన్ పవర్:** బెజవాడ పాలిటిక్స్ మరోసారి హీటెక్కడం ఖాయంగా కనిపిస్తోంది. టీడీపీ ఫైర్ బ్రాండ్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నను పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్‌గా ఇటీవల సీఎం చంద్రబాబు నామినేట్ చేశారు. ఆయన బాధ్యత స్వీకార ఘట్టం అంగరంగ వైభవంగా సాగింది. దీనిని బట్టి..వచ్చే ఎన్నికలకు ఆయనను రెడీ చేస్తున్నారా? అనే సందేహాలు, చర్చ కూడా తెరమీదికి వచ్చాయి. కానీ, అలాంటిదేమీ లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. నియోజక వర్గంలో బాధ్యత వేరు.. టికెట్ వేరన్నది గత ఎన్నికల్లోనూ స్పష్టమైంది. ఇక, తాజాగా బుద్ధాకు ఈ పదవి ఇవ్వడం వెనుక.. కీలక వ్యూహమే ఉందని అంటున్నారు. త్వరలోనే మునిసిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కీలకమైన పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ పరంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్పొరేషన్‌లో తమ సత్తా చాటుకునేందుకు బలమైన వాయిస్ ఉన్న నాయకుడి అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలోనే బుద్ధాకు పదవి ఇచ్చారని చెబుతున్నారు. మరోవైపు.. వైసీపీ తరఫున ఉన్న వెల్లంపల్లి శ్రీనివాస్, పోతిన వెంకట మహేష్ వంటివారు కార్పొరేషన్‌పై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.దీనికి చెక్ పెట్టడంతోపాటు బెజవాడలో టీడీపీకి పునర్వైభవం తీసుకువచ్చేందుకు కూడా.. టీడీపీ అడుగులు వేసిం ది. ఈ క్రమంలోనే బుద్ధాకు నియోజకవర్గాన్నిఅప్పగించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఇటు పశ్చిమలో అయినా.. అటు తూర్పులో అయినా.. బుద్ధా కు తిరుగున్న నాయకుడు పెద్దగాలేరనే చెప్పాలి. పక్కా మాస్ ఇమేజ్‌తో పాటు.. స్పాంటేనియస్ పాలిటిక్స్ చేయడంలో బుద్ధా తనకు తానే సాటి అనగల స్థాయిలో ఉన్నారు. పైగా ఈ తరహా వాయిస్ ఉన్న నాయకుడు వైసీపీలో కనిపించడం లేదు.అదే సమయంలో జగన్ సహా.. సజ్జల రామకృష్ణారెడ్డి వంటివారిపై బలమైన దూకుడుగా వ్యవహరించే బుద్ధాను ప్రోత్సహించే క్రమంలోనే టీడీపీ ఇప్పుడు ఆయన కు పదవిని ఇచ్చింది. తద్వారా రెండు రకాలుగా బుద్ధా ఇప్పుడు పార్టీ కి దన్నుగా నిలవనున్నారు. వైసీపీ కి చెక్ పెట్టడం ఒక పార్ట్ అయితే.. అదే సమయంలో టీడీపీని బలోపేతం చేయడం.. బీసీ సామాజిక వర్గాన్ని మరింత చేరువ చేయడం.. తద్వారా కార్పొరేషన్‌లో పాగా వేయడం అనే లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. బుద్ధాకు సాటిరాగల నాయకులు లేకపోవడం.. వైసీపీకి పెద్ద మైనస్‌గా మారింది.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వెలిగొండ జలాల కోసం సీఎం పేరున ప్రత్యేక పూజలు

### ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి భక్తిశ్రద్ధలతో పూజలు





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 13**

త్వరలో వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు మార్కాపురం ప్రాంతానికి రానున్న సందర్భంగా గురువారం జమ్మనపల్లి గ్రామంలోని ముద్దసానమ్మ గండి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని కుంకు మార్చన చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంద సంవ త్సరాలు ఆయురారోగ్యాలతో ఉండా లని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని అమ్మవారిని ప్రార్థించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మార్కాపురం జిల్లాకు సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతుల పొలాలకు సమృద్ధిగా నీరు చేరి ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ అసాధ్యం అనుకున్న వెలిగొండ ప్రాజెక్టును సుసాధ్యం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని అన్నారు. వెలిగొండ జలాలు త్వరలో రానున్న నేపథ్యంలో మార్కాపురం నియోజకవర్గంలోని ప్రతి దేవాలయం, మసీదు, చర్చిలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించాలని ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక జిల్లా సాధన, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కోసం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఎంతో శ్రమించారని కొనియాడారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం వంద శాతంతో ఏల్చూరు ప్రథమ స్థానం

### అద్దంకి నియోజకవర్గంలో ఆదర్శవంతంగా పూర్తిచేసిన తొలి గ్రామం




**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 13**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసి ఆదర్శవంతంగా నిలిచారు. గ్రామంలోని 8 పోలింగ్ బూత్‌ల పరిధిలోని 2,619 ఇళ్లను సందర్శించి 'మై టీడీపీ' యాప్ సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామ నాయకులు దద్దేల గాలయ్య ఆధ్వర్యంలో కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కేఎస్ఎస్ సభ్యులు సమన్వయంతో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేశారు. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వంద శాతం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని పూర్తి చేసిన గ్రామంగా ఏల్చూరు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమాన్ని తక్కువ సమయంలోనే విజయవంతంగా పూర్తి చేసిన ఏల్చూరు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్, మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లినందుకు ఏల్చూరు నాయకులకు వారు అభినందనలు తెలిపారు.




# విజయసాయపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ

**నెల్లూరు, ఆగస్టు 13, పెన్ పవర్:**



వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..!




**విజయవాడ, ఆగస్టు 13, పెన్ పవర్:**

తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు.అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది.పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు.ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

# శ్రీరంగరాజపురంలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

### –అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించిన ఇంటూరి –ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ప్రచారానికి మంచి స్పందన

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 13:**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలో జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ చేపట్టిన ఇంటింటి ప్రచారానికి మంచి స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా కందుకూరు నియోజకవర్గంలో ఈ గ్రామానికి వెళ్లినా... అక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి స్థానికులే సంతోషంగా చెబుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రోడ్లు, కాలువలు, తాగునీరు, స్మశానాల అభివృద్ధి వంటి మౌలిక వసతులన్నీ ఒక్కొక్కటిగా ఏర్పడుతున్నాయి. గతంలో ఏ నాయకుడు తమ గురించి పట్టించుకోలేదని చెబుతూఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలిచిన తర్వాత తమ సమస్యలు చాలావరకు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా.... ఇంటింటి ప్రచారానికి వెళుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మహిళలు, యువత, వృద్ధులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం రాత్రి కందుకూరు మండలంలోని శ్రీరంగరాజపురం (మదనగోపాలపురం) గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన జనసందోహం మధ్య సాగింది. పార్టీ నేతలతో కలిసి ఆయన ఎస్సీ ఎస్టీ కాలనీల్లో తిరుగుతూ కరపత్రాలు పంచారు. ఎప్పుడూ పెద్దగా బయటకురాని ఎస్టీ కాలనీ వాసులు... ఈసారి ఎమ్మెల్యేకు మద్దతు తెలిపారు. కాలనీలో పెండింగ్ సమస్యలన్నీ పరిష్కారమయ్యేలా అధికారులను ఆదేశించడంతో, కాలనీవాసులు



సంబరపడ్డారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని, 3 కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ ఫలాలు గ్రామస్తులకు అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గొంది నరసింగరావు, యూనిట్ ఇంచార్జ్



ప్రతాప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వంకదారి శ్రీను, స్థానిక నేతలు పూనూరి వీరారెడ్డి, రమణారెడ్డి, మోహన్ రెడ్డి, దేవరపల్లి మాలకొండారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, చిరంజీవిరెడ్డి, వినోద్ రెడ్డి, ఆహా మాల్యాద్రి, రావుల రవి, రాగయ్య, సుబ్రహ్మణ్యం, మాదాల రవి, వెంకారెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడల్లో బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 13**
అమరావతి స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్--2026లో కందుకూరు బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో అండర్--17 విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆర్చరీలో 20 మీటర్ల విభాగంలో కనమర్లపూడి వెంకట సౌరీష్, ఖోఖో విభాగంలో పి. లక్ష్మీ దత్తు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు టి. అనిల్, కొండయ్య, జి. వేణు ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొని ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ జి. బాల భాస్కరరావు మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం సాధన చేయడం వల్లే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. క్రీడలతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించి, భవిష్యత్ పోటీల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి. నరేంద్రబాబు, డీన్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## మూడు రంగుల విద్యుత్ కాంతులతో బల్లికురవ పోలీస్ స్టేషన్





**సంతమాగులూరు,( బల్లికురవ ) పెన్ పవర్, ఆగస్టు 13**
సంతమాగులూరు సీఐ శేషగిరిరావు సూచనల మేరకు బల్లికురవ ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ భవనాన్ని ముప్వన్నెల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను జాతీయ జెండా రంగులైన కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న పోలీస్ స్టేషన్ భవనం చూపరులను ఆకట్టుకుంటూ జాతీయతా స్ఫూర్తిని చాటుతోంది.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురికి జైలు శిక్ష.. జరిమానా

### ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హాజరతయ్య

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 13**



విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన 16 మందిని బుధవారం ఒంగోలు కోర్టు నందు హాజరు పరిచారు. 9 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 90,000/- వేల రూపాయలు జరిమానా విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హాజరతయ్య తెలిపారు. 7 మంది వాహన దారులకు ఒక్కొక్కరికి రెండు రోజులు చొప్పున జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. వాహన చోదకులు మోటారు వెహికల్ నిబంధనలను తప్పక పాటించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ధరించకుండా, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వాహనదారులకు సిఐ హెచ్చరించారు.

## సమైక్యస్ఫూర్తిని చాటిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### –పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్, అధికారులు, నేతలు

### –త్రివర్ణ పతాకాలతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 13**
పట్టణంలో దేశభక్తి వెల్లివిరిసింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించగా, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పలు రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమైక్యవాదాన్ని చాటిచెప్పారు. ఎల్ఐసి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన సైకిల్ ర్యాలీలో గౌరవ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే.అనూష , సిఐ అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చివరగా అందరి చేత దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇంటింటా ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవటంతో పాటు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు పలు పాఠశాలల విద్యార్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, పొదుపు గ్రూపు మహిళలు, ఇంకా పలురా అనేక రంగాలకు చెందినవారు జాతీయ జెండాలు చేతబట్టి, నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు, పార్టీ నాయకులు ఉన్నం వీరాస్వామి, పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, అల్లం వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, బిజెపి నాయకులు వరప్రసాదరావు, రాయపాటి శ్రీనివాసరావు, చనమాల శ్రీధర్, అన్న క్యాంటీన్ చైర్మన్ కొండలరావు, ఏఎంసి డైరెక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**
గిద్దలూరు మండలం పొదలకొండపల్లి గ్రామం నందు " ఇంటింటికీ కూటమి ప్రభుత్వం – సంక్షేమ విజయాలు " కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ , గ్రామ నాయకులు , ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే నుశాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండలం తెలుగుదేశం పార్టీ ,జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓగూరు గ్రామం లో రెండేళ్ల నమ్మకం

### - అభివృద్ధి, సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 13:**
గడిచిన రెండు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తెలుగుదేశం పార్టీ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆలోచనతో కందుకూరు నియోజకవర్గంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ కందుకూరు మండలం ఓగూరు, ఆది ఆంధ్ర కాలనీ గ్రామంలో మాజీ డెయిరీ ఛైర్మెన్ చల్లా శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. 24 నెలల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ అలాగే కందుకూరు నియోజకవర్గంలో శాసనసభ్యులు



చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేయడం జరిగింది. అలాగే గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ వారికి కావాల్సిన అవసరాలను ఎమ్మెల్యే ద్వారా పరిష్కారం చూపుతామని తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాసరావు, పోలిపోగు వాసుదేవ్, పోలిపోగు వెంకటరావు, గద్దె అశోక్, రాయపాటి పుల్లయ్య, కోట మధు బాబు, కోట బాలయ్య, కరేటి ప్రభాకర్, పాలేటి మరిదాసు, గర్నెపూడి దుర్గాభవాని, పోలుపోగు చంద్రకళ, మొండితోక మరియమ్మ, గద్దె చిన్నమ్మాయి, గద్దె ప్రభుదేవా, పోలుపోగు చిన్న మాల్యాద్రి, మంద కొండలరావు, తాటిపర్తి లక్ష్మణ్, గర్నెపూడి గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్ట్‌పై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల

### వెలుగొండ ద్వారా గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు వినియోగ పడేలా చూడండి




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 13**
పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతి, ఆర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు, నిర్వాసితులకు పరిహారం, ముంపు గ్రామాల ప్రజల తరలింపు తదితర అంశాలపై మార్కాపురం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన వెలిగొండ ప్రాజెక్ట్ అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని, నిర్వాసితుల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. త్వరితగతిన గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు ప్రాజెక్ట్ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు అశోక్ రెడ్డి అధికారులను కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com